# ప్రేమ నిండిన లోకం

-- సౌమ్య

"హాయ్" స్క్రీను పై ఒక మెసేజి పలకరించడంతో నిరాసక్తంగా దాని వైపు చూసింది హిమజ. అటువైపు నళిని, తన ప్రాణ స్నేహితురాలు. యాంత్రికంగా తానూ తిరిగి హాయ్ కొట్టి మళ్ళీ ఆలోచనల్లో మునిగే ప్రయత్నం మొదలుపెట్టింది హిమజ.

కానీ, ఇంతలోపే మళ్ళీ నళిని మెసేజి- "ఏమిటే ఈరోజు పొద్దున్నుంచి అదోలా ఉన్నావు? చాలా దిగులుగా కనిపిస్తున్నావ్? ఫోన్‌లో కూడా ఎవర్నో విసుక్కున్నావ్?" అని.

సిఐడి పని కూడా మొదలుపెట్టావా తల్లీ? అనబోయి ఏమీ జవాబివ్వలేదు హిమజ. కాసేపు చూసి మళ్ళీ మెసేజి కొట్టింది నళిని.

"ఏమిటే...అడిగింది నిన్నే. ఎందుకలా వున్నావు? అంత కష్టంగా ఉంటే చెప్తే కదా మేమేమైనా చేయగలమా అన్నది తెలిసేది? నువ్వొక్కదానివి అశోకవనంలో సీతలా కూర్చుంటే ఏం చేయగలం?"

"ఒకళ్ళకి చెప్తే తీరే రకం కష్టాలు కావు కొన్ని."

"అది కాదే...స్నేహితురాలిగా ఆ మాత్రం శ్రద్ధ చూపడం నా బాధ్యత. నువ్వు కోపం తెచ్చుకోకు."

"నేనేం కోపం తెచ్చుకోడం లేదు. విషయం చెబుతున్నా...అంతే!"

"హుం....సరేలే. ఎక్కువ ఆలోచించకు..."

"ఒకే. థాంక్స్"

ఇక ఓ ఐదు నిముషాలు ఆగితే హిమజే విషయం చెబుతుందని అర్థమైంది ఈ పొడి జవాబు చూసాక నళినికి. స్నేహం వయసు పెరిగి అది గట్టిపడే కొద్దీ అవతలి మనిషి మూడ్ ని కనిపెట్టడం తేలికౌతుంది కాబోలు - నళిని అంచనా నిజమైంది.

కొద్ది క్షణాల తరువాత హిమజ నుండి మెసేజ్ -

"రాజేశ్ నేనూ విడిపోబోతున్నాం"

కొంతవరకూ ఇటువంటిదేదో జరిగుంటుందని ఊహించినా కూడా వ్యవహారం విడిపోవడం దాకా వచ్చిందని నళిని అనుకోలేదు. అందుకే ఆశ్చర్యంతో, "ఏమైందే ఉన్నట్లుండి? గొడవపడ్డారా ఏమిటి?"

"ఏమని చెప్పమంటావ్ నళినీ...ఎక్కడ మొదలుపెట్టను? నాకు నిన్నటితో ఒక విషయం అర్థమైంది...."

"ఏ విషయం అర్థమైంది ఏమిటి?" నవ్వు స్మైలీ జోడిస్తూ అడిగింది నళిని.

"నవ్వకు. ఇది చెప్పాక కూడా నవ్వను అంటేనే చెప్తాను"

"సరే.. చెప్పు తల్లీ"

"ప్రేమ అన్నదంతా ట్రాష్ ఏమో అనిపిస్తోందే నాకు" ఈమాట అన్నాక నళిని పెద్దగా నవ్వినట్లు చూపింది స్క్రీను స్మైలీ.

నిజంగానే అవతలివైపు నవ్వుకుందేమో అలా పెద్దగా.

"ఎందుకే ఆ వెధవ నవ్వు? నేనో పక్క చిరాగ్గా ఉంటేనూ!" హిమజే మళ్ళీ కోపంగా అడిగింది.

"అది కాదే..ప్రేమ అన్నదే ట్రాష్ అంటేనూ...మరి నాకు నవ్వొచ్చింది.."

"నీకేమి తెలుసే నవ్వడానికి? నువ్వేమన్నా ప్రేమించావా ఏం? నా బాధ నీకేం తెలుస్తుంది?"

"నీ బాధ నాకు తెలీదు అంటే ఒప్పుకుంటా కానీ...నేను ప్రేమించలేదంటే మాత్రం ఒప్పుకోలేను అసలు!"

"ఇదేమిటి కొత్తకథ! నువ్వు ప్రేమలోనా...చెప్పు చెప్పు.." చిరాకు పరాకూ పోయి ఆసక్తి తొంగి చూసింది హిమజలో.

"ఇదేమిటే...భగ్న ప్రేమికురాలిలా ఉన్నావ్ ఇంతసేపు.. ఇప్పుడు చూస్తే తెగ ఆసక్తి చూపిస్తున్నావ్?"

"అబ్బ! ఈ విషయం వదిలేయి. నీ విషయం చెప్పు...ఎవరే అతగాడు?"

"సినిమా టైటిల్"

"ఇదిగో... ఇలా సతాయించకు. సంగతి చెప్పు."

"వెల్...మరి...చెప్పాక నామీదకి దండెత్తకూడదు మరి!"

"అబ్బ...ఇదంతా ఏమిటి...నువ్వు సంగతి చెబుతావా లేదా?"

"అంటే...హుమ్..నేను నిజానికి ... ఇప్పుడు నువ్వు ఎవరే అతగాడు...అసలు నేను ప్రేమించింది ఒకరినే అని ఎందుకు అనుకుంటున్నావు?"

"..........."

"ఏమిటే ఏమీ మాట్లాడవు?"

"ఏం మాట్లాడమంటావ్? మరీ ఇలా సిగ్గులేకుండా మాట్లాడితే నువ్వు?"

"అది కాదు... నువ్వు నేనన్నదాన్ని సరిగా అర్థం చేసుకోవడం లేదు. నాకు ప్రేమించడం తెలుసు అనగానే నువ్వు నేనొకబ్బాయికి మనసిచ్చాను అని ఎలా అనుకున్నావు?"

"అంటే, ప్రేమించాను అని నువ్వే అన్నావు కదా..."

"అది ఒక అబ్బాయిని అని నేనెక్కడా చెప్పలేదే!"

"ఇదిగో... ఇలా తిక్కతిక్కగా మాట్లాడి నన్ను గందరగోళానికి గురి చేయకు."

"హుం...నేనన్నది...ఇంకోరకంగాలే. నీకు అర్థమై ఉంటుంది అనుకున్నా...ఐనట్లు లేదు. ఇక వివరంగా చెప్పాలి.. క్లాసు మొదలు...హుమ్..ప్రేమ...ప్రేమించడం అన్నదానికి నా నిర్వచనం వేరు..."

"ఏమిటో!"

"ప్రేమ అన్నది ఒకమ్మాయి, ఒకబ్బాయి మధ్యలో మాత్రమే పుట్టగలిగేది కాదు అని నా అభిప్రాయం. ఏప్పుడన్నా, ఎక్కడన్నా, ఎవరి మధ్య అన్నా ఏర్పడవచ్చు అన్నది నా అభిప్రాయం. భార్యాభర్తల మధ్య ప్రేమా, తల్లికీ బిడ్డకీ మధ్యగానీ, అన్నకీ చెల్లికీ మధ్య కానీ నీకూ

నాకూ మధ్య ఉన్న బంధం కానీ, ఏదన్నా పేరేది పెట్టుకున్నా కూడా దాని అర్థం ఆఖరికి ప్రేమే అని నా అభిప్రాయం."

"హుమ్...మనిద్దరం కూడ ప్రేమికులమంటావా?"

"అంత వెటకారం వద్దులే కానీ...వాడుక భాషలో ఒక్కో ప్రేమకి ఒక్కో పదం ఉంటుంది. చెప్పా కదా... పేరేది పెట్టుకున్నా అంతర్లీనంగా అన్నింటిలో ఉండేది ప్రేమే!"

"దేవుడికి భక్తుడికి మధ్యన ఉండేది?"

"భక్తి అన్న మారు పేరుతో అక్కడ ఉండేది కూడా ప్రేమే. అదే కాదు...ప్రపంచంలో ప్రేమ లేని చోటు అన్నది లేదు. నువ్వు చూడగలగాలే కానీ ప్రేమ అన్నది నీ జీవితమంతా.. ఈ లోకమంతా అనుక్షణం తన ఉనికిని చూపించుకుంటూనే ఉంది."

ఆలోచనలో పడ్డట్టుగా హిమజ వైపు నుండి ఒక "ఊ" వచ్చింది.

"భిన్నత్వంలో ఏకత్వం - ఏకత్వంలో భిన్నత్వం రెండూ ఉన్నాయి ఈ ప్రేమలో. రకరకాల పేరుతో చెలామణి అయినా, అన్ని దారుల్నీ కలిపేది ప్రేమే. ఒక్కటిగా కనిపిస్తున్నా ఎన్నో అవతారాలున్నదీ ప్రేమే!"

"అబ్బో! చాలా చెప్పేస్తున్నావే!"

"నా ప్రయత్నమంతా ప్రేమ అన్నది ట్రాష్ అన్న మాటే వట్టి ట్రాష్ అని నీకు చెప్పడం కోసమే..."

"హుమ్.. సరే...ఒప్పించేస్తున్నావు నన్ను. నాకు ఇదంతా విన్నాక ఒప్పుకోడం మినహా దారి కనబడ్డం లేదు. పూర్తిగా ఒప్పుకోలేనేమో...కానీ, ఒప్పుకుంటాను...ఈ డిస్కషన్ నాకు ఎంత సాంత్వన కలిగించిందో తెలుసా?"

"నీ వద్దకు వచ్చి ఇదంతా చెప్పివుంటే... పట్టుకుని తన్ని ఉండేదానివి ఈపాటికి...థాంక్స్ టు చాటింగ్... "

"నిజం! చాటింగ్ కూడా ప్రేమకు తోడ్పాటు అందిస్తుంది అన్నమాట!:)"

"ప్రేమ నీ లోకమంతా నిండితే...నీకు అన్ని దిక్కుల్నుంచి ప్రేమకి తోడ్పాటు ఉన్నట్లే అనిపిస్తుంది...ఈ మెసెంజరుకి లేనిది ప్రాణమొక్కటే! కానీ లోకమంతా నిండిన ప్రేమకి నేను సైతం అంటూ తోడ్పాటు అందిస్తోంది..."

"మాతా ప్రేమానందమయీ! ఇక చాలు... ఆపుదామా? నువ్విక ప్రతిదానిలోనూ, ప్రతి మనిషిలోనూ ఉన్న ప్రేమ కోణం వెతికి తీసేదాకా వదిలేలాలేవు.."

"ఓకే.. ఆపేస్తా...నువ్వు మంచి మూడ్ లోకి వచ్చిన సందర్భంగా క్యాంటీన్‌కు వెళ్ళి కాఫీ తాగుదామా?"

"సరే.." అంటూ హిమజ లేచింది. ఎదురు క్యాబిన్ లో కూర్చుని ఉన్న నళినీ లేచింది. ఇద్దరూ కలిసి నవ్వుతూ క్యాంటీను వైపు వెళ్ళారు, ప్రేమ నిండిన లోకం గురించిన జ్ఞానం ఇచ్చిన కొత్త ఉత్సాహంతో.